సాక్షి
ఖమ్మం
గురువారం । 21 । సెప్టెంబర్ । 2023



కొనుగోలు లక్ష్యం పెరిగింది..

ఈ వానాకాలంలో రైతులు పండించిన ధాన్యంలో 5 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని అధికారులు లక్ష్యంగా నిర్ణయించారు. 8లో



'వందేభారత్'లో మరిన్ని సౌకర్యాలు

వందేభారత్ రైలులో ప్రస్తుతం ఉన్న సౌకర్యాలను అధికారులు మరింతగా పెంచారు. దీంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 10లో

వాతావరణం

గరిష్ఠం / కనిష్ఠం
29° / 24°

జిల్లాలో గురువారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు జిల్లాలో మంత్రి పువ్వాడ పర్యటన



ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10.30 గంటలకు నగరంలోని 19వ డివిజన్‌లో, 10.45 గంటలకు 16వ డివిజన్‌లో, 11 గంటలకు 14వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. సాయంత్రం 4గంటలకు రఘునాథపాలెం మండలం హర్యాతండా, 4.35 గంటలకు పుటానితండా, 4.50 గంటలకు సూర్యాతండా, 5.05 గంటలకు వాంకుడోత్ తండా, 5.20 గంటలకు రాంక్యాతండాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు.

దివ్యాంగులకు వీల్‌చైర్ల పంపిణీ



దివ్యాంగులకు వీల్‌చైర్లు అందిస్తున్న జావేద్ పాషా

ఖమ్మంలీగల్/ ముదిగొండ : మండలంలోని వెంకటాపురం గ్రామంలో పెద్దమండవకు చెందిన ఇద్దరు దివ్యాంగులకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జావేద్ పాషా బుధవారం వీల్‌చైర్లు పంపిణీ చేశారు. సోదరులైన ఇద్దరు దివ్యాంగులు చాపలమడుగు బూషి, దశరథ్‌లకు వారి తల్లి దానమ్మ సపర్యలు చేస్తూ వచ్చింది. ఆమె పడుతున్న ఇబ్బందులను చూసి చలించిన జడ్జి జావేద్ పాషా వీల్‌చైర్లు అందించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా తమకు సదరమ్ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని దివ్యాంగులు జావేద్ పాషాను వేడుకున్నారు. దానమ్మ తన మనుమడు క్రాంతికి దళితబంధు మంజూరు చేయాలని కోరగా, వారి వినతులను జిల్లా అధికారులకు సిఫార్సు చేస్తానని జడ్జి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి సునీల్, ఖమ్మం రూరల్ సీడీపీఓ కమలప్రియ, సూపర్‌వైజర్ సంధ్యారాణి, అంగన్‌వాడీ టీచర్ అరుణకుమారి, పారాలీగల్ వలంటీర్ పద్మ తదితరులు పాల్గొన్నారు.



పర్యావరణ పరిరక్షణలో మీరు భాగమై మట్టి గణేషుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించారా? జిల్లాలోని అపార్ట్‌మెంట్లు, కాలనీలు లేదా ఇళ్లలో ప్రత్యేక ఆకృతుల్లో ప్రతిమను ఏర్పాటుచేశారా? అయితే, మీ విగ్రహ ప్రత్యేకతలను 'సాక్షి' పాఠకులతో పంచుకోండి. మట్టి, ప్రత్యేక ఆకృతుల్లోని విగ్రహాలతో సెల్ఫీ దిగి వాట్సప్ చేయండి. మీ పేరు, చిరునామా స్పష్టంగా ఉండాలి. మాకు అందిన ఫొటోల్లో ఎంపిక చేసిన వాటిని ప్రచురిస్తాం.

వాట్సాప్ చేయాల్సిన నంబర్ :
98498 08197



ఖమ్మం నగరంలో ప్రవహిస్తున్న మున్నేరు

టెండర్లకు రెడీ!

మున్నేరు రక్షణ గోడలకు తుది రూపం

- ఇరువైపులా 17 కిలోమీటర్ల మేర నిర్మాణానికి ప్రణాళిక
- భూ సేకరణపై అధికారుల దృష్టి
- 197 ఎకరాలు అవసరమని అంచనా..

ఖమ్మంఅర్బన్: ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిస్తే మున్నేరు పరీవాహక ప్రాంత ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. పలు కాలనీలను వరద ముంచేస్తోంది. ఈ ఏడాది జూలైలో వచ్చిన వరదతో నగర వాసులు అతలాకుతలం అయ్యారు. దీంతో ఇకపై వరద ప్రభావంతో ఎవరూ నష్టపోవద్దనే ఉద్దేశంతో ప్రభుత్వం మున్నేరుకు ఇరువైపులా రక్షణ గోడల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. ఇందుకోసం ఇప్పటికే రూ. 690 కోట్లు మంజూరు చేసింది. రక్షణ గోడల నిర్మాణానికి అవసరమైన భూ సేకరణకు రెవెన్యూ, జలవనరుల శాఖ అధికారులు కసరత్తు చేపట్టారు. వారం రోజుల క్రితం ఖమ్మం ఆర్డీఓ జి.గణేష్, ఖమ్మం అర్బన్, రూరల్ తహసీల్దార్లు సీహెచ్ స్వామి, రామకృష్ణ, ఆర్‌ఐ రమేష్ తదితరులు జలవనరుల శాఖ అధికారులతో కలిసి సంయుక్తంగా సర్వే చేశారు. ఇరువైపులా 17 కిలోమీటర్ల దూరం వరకు రక్షణ గోడల నిర్మాణానికి ప్రభుత్వ భూమితో పాటు, ప్రైవేటు భూముల సేకరణకు శ్రీకారం చుట్టారు. మొత్తం ఎంత భూమి అవసరం అవుతుందనే దానిపై ప్రాథమికంగా సర్వే చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు.

శాశ్వత పరిష్కారం చూపేలా..

ఈ ఏడాది మున్నేరు ఎగువ ప్రాంతాల్లో అత్యధిక వర్షాలు కురవడంతో ఖమ్మం నగరంలో మున్నేరు



రక్షణ గోడల నిర్మాణానికి సర్వే మ్యాప్ పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

పొంగి ప్రవహించింది. 35 అడుగులకు పైగా వరద రావడంతో నగరంలో మున్నేరుకు ఇరువైపులా ఉన్న కాలనీలు మునిగిపోయాయి. వరద తాకిడితో 2వేల మందికి పైగా ఇబ్బంది పడ్డారు. అధికారులు వారందరినీ పునరావాస కేంద్రాలకు తరలించి, వరద తగ్గే వరకు సహాయం అందించారు. అయితే తరచూ వరద ప్రభావంతో ముంపు ప్రాంతాల వారు ఇబ్బంది పడుతున్నారని, దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, కలెక్టర్ వీపీ గౌతమ్, ఇతర ప్రజాప్రతినిధులు సీఎం కేసీఆర్‌ను కోరారు. దీంతో మున్నేరుకు ఆర్‌సీసీ వాల్ నిర్మించేందుకు మొదట రూ.150 కోట్లు కేటాయించాలని కేబినెట్ సమావేశంలో నిర్ణయించారు. ఆ తర్వాత నిధులు కేటాయిస్తున్నట్లు అసెంబ్లీలోనూ ప్రభుత్వం ప్రకటించింది. అయితే మున్నేరు పరీవారిక ప్రాంతం మొత్తానికి శాశ్వత పరిష్కారం చూపేలా ప్రతిపాదనలు తయారుచేయాలని జలవనరుల శాఖ అధికారులను మంత్రి పువ్వాడ ఆదేశించారు. దీంతో ఆ శాఖ ఉన్నతాధికారులు, ఇంజనీరింగ్ అధికారులు సమగ్ర సర్వే చేశారు. మున్నేరుకు ఇరువైపులా 8.5 కిలోమీటర్ల చొప్పున మొత్తం 17 కిలోమీటర్ల మేర ఫ్లడ్ ప్రొటెక్షన్ వాల్ నిర్మించాలని, ఇందుకు రూ.750 కోట్లు అవసరమని అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి అందించారు. భూసేకరణకు మరిన్ని నిధులు అవసరమవుతాయని పేర్కొన్నారు. మున్నేరు పరీవాహక ప్రాంతాలైన గోళ్లపాడు, పోలేపల్లి, ఏదులాపురం, గుర్రాలపాడు, గుదిమళ్ల, మల్లెమడుగు, దానవాయిగూడెం, బురాన్‌పురం రెవెన్యూ గ్రామాల పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు భూములు కలిపి 83 ఎకరాలు, ఖమ్మం అర్బన్ పరిధిలో 197 ఎకరాలు అవసరం ఉంటుందని గుర్తించారు. అందులో ప్రస్తుతం ప్రభుత్వ భూమి 48 ఎకరాలు మాత్రమే ఉండగా, మిగిలిన భూమి సేకరించాల్సి ఉంటుంది.

హైదరాబాద్‌లోనే అధికారుల మకాం..

ఇరువైపులా రక్షణ గోడల నిర్మాణానికి సుమారు 60 ఎకరాలకు పైగా భూమి సేకరించాల్సి ఉంటుంది. ఇందుకోసం రూ.59కోట్ల నిధులు అవసరమని అంచనా వేశారు. గోడలతో పాటు, వరద కాల్వలు కూడా నిర్మించాలంటే మొత్తం 194ఎకరాల వరకు భూమి సేకరించాల్సి ఉంటుంది. ఇందుకు సుమారు రూ.200 కోట్లు ఖర్చవుతాయి. దీనికి తోడు భూ సేకరణకు కూడా అధిక నిధులు కావాల్సి వస్తుంది. ఈ మేరకు రెండురకాల డీటెయిల్డ్ డిజైన్లను రూపొందించిన జలవనరుల శాఖ అధికారులు.. టెండర్ల ప్రక్రియ పూర్తి చేసేందుకు హైదరాబాద్‌లోనే మకాం వేసి కుస్తీ పడుతున్నట్లు సమాచారం. వారం, పదిరోజుల్లో అనుమతి రాగానే టెండర్లు పిలిచేందుకు సర్వం సిద్ధం చేశారు.

రూ.లక్ష లోపు రుణమాఫీ నగదు జమ

కలెక్టర్ గౌతమ్ వెల్లడి

ఖమ్మంసహకారనగర్: రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన రూ.లక్ష లోపు రుణ మాఫీలో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు సంబంధించిన నగదును బ్యాంకుల్లో జమ చేశామని కలెక్టర్ వి.పి.గౌతమ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బుధవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ.. సాగుకు అవసరమైన ఎరువుల నిల్వలు అందుబాటులో ఉంచేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రభుత్వ భూముల్లో నివాసం ఏర్పాటు చేసుకున్న అర్హులైన వారి భూముల క్రమబద్ధీకరణకు జీఓ 58 ద్వారా పట్టాలు అందించామని చెప్పారు. జీఓ 59 కింద దరఖాస్తు చేసుకున్న వారికి నోటీసులు అందజేశామని, నిబంధనల మేరకు రుసుము చెల్లించిన వారి భూముల క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకున్నామని వివరించారు. గృహలక్ష్మి పథకం కింద ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నామని చెప్పారు. ఆసరా పెన్షన్ పొందుతూ మరణించిన వారి స్థానంలో కుటుంబసభ్యుల్లో అర్హులుంటే పెన్షన్ మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు లక్ష్యాలను పూర్తి చేసి మరింత సాగు విస్తీర్ణం పెంచేలా రైతులను ప్రోత్సహిస్తున్నామని, హరితహారం పథకంలో జిల్లాకు నిర్దేశించిన లక్ష్యం పూర్తి చేసేందుకు అధికారుల సమన్వయంతో చర్యలు చేపడుతున్నామని వివరించారు. వీసీలో అదనపు కలెక్టర్లు సత్యప్రసాద్, డి.మధుసూదన్ నాయక్, నగరపాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి, జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్ సింగ్, డీఆర్డీఓ విద్యాచందన, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సరిత, ఉద్యానవన శాఖ అధికారి అనసూర్య, జెడ్పీ సీఈఓ వి.వి.అప్పారావు, పీఆర్ ఎస్‌ఈ చంద్రమౌళీశ్వరరావు, ఈఈ కె.వి.కె.శ్రీనివాస్, ఇరిగేషన్ ఈఈ వెంకట్రాం, సీఈఓ శ్రీనివాస్, ఎల్‌డీఎం శ్రీనివాస్ రెడ్డి, ఖమ్మం, కల్లూరు ఆర్డీఓలు అశోక్ చక్రవర్తి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్

పోటెత్తిన ఓటరు దరఖాస్తులు

జిల్లాలో నూతన ఓటు నమోదు, తొలగింపు, చిరునామా మార్పు తదితర దరఖాస్తులు మొత్తం 73,028 వచ్చాయని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఫారం 6 (ఓటర్ నమోదు)కు 31,458 దరఖాస్తులు, ఫారం 7 (తొలగింపు) 20,276 దరఖాస్తులు, ఫారం 8 (అడ్రస్ మార్పు) 21,294 దరఖాస్తులు వచ్చాయని వివరించారు. ఇందులో ఇప్పటివరకు ఫారం- 6లో 12,960, ఫారం-7లో 1,029, ఫారం -8లో 4,520.. మొత్తం 18,509 దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలన పూర్తిచేసినట్లు తెలిపారు. మిగిలిన దరఖాస్తులను కూడా పరిశీలించాక అక్టోబర్ 4వ తేదీన తుది ఓటరు జాబితా ప్రకటిస్తామని పేర్కొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించండి



అంగన్‌వాడీల ఆందోళనలో మాట్లాడుతున్న హేమంతరావు

- సీపీఐ, సీపీఎం నేతలు బాగం, నున్నా డిమాండ్
- కలెక్టరేట్ వద్ద ఆందోళన

ఖమ్మంమయూరిసెంటర్ : సమాజ సేవ చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తోందని, సమ్మె విచ్ఛిన్నానికి కుట్ర పన్నుతోందని ఆరోపించారు. 10 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది బుధవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించగా సీపీఐ, సీపీఎం నేతలు మద్దతు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నింటిలో ముందున్నామని చెప్పుకునే తెలంగాణ ప్రభుత్వం అంగన్‌వాడీలకు సమకూర్చే సౌకర్యాలు, వేతనాలు ఇతర రాష్ట్రాల కంటే తక్కువగా ఉన్నాయని విమర్శించారు. తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాల్లో అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారని, ఇక్కడ ఆ పని ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు హెల్త్ కార్డులు, ఇతర సదుపాయాలు కల్పిస్తున్నాయని, మరి కొన్ని రాష్ట్రాలు ఉద్యోగ విరమణ తర్వాత కూడా సదుపాయాలు కల్పిస్తున్నాయని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వేసిన తాళాలు పగులగొడుతూ బెదిరింపు చర్యలకు పాల్పడుతున్నారని, దీనికి తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్, ఐసీడీఎస్ పీడీలకు వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సీపీఎం నాయకులు యర్రా శ్రీకాంత్, వై.విక్రమ్, ఏఐటీయూసీ నాయకులు సింగు నర్సింహారావు, గాదె లక్ష్మీనారాయణ, తోట రామాంజనేయులు, కళ్యాణం వెంకటేశ్వరరావు, ప్రజా సంఘాల బాధ్యులు సీహెచ్ సీతామహాలక్ష్మి, కోటేశ్వరి, సుభా, రాధా, నాగమణి, పాపారాణి, బేబీరాణి, పద్మ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో రైతుల హర్షం

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం రాత్రి వర్షం కురవడంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ముందుగానే ప్రకటించింది. అల్పపీడన ప్రభావం జిల్లాలో నాలుగు రోజుల పాటు ఉంటుందని కూడా ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. కొద్దిరోజులుగా అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్న ప్రజలు సైతం వర్షం కోసం ఎదురుచూశారు. ఎట్టకేలకు బుధవారం రాత్రి ఉరుములతో కూడిన వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. తిరుమలాయపాలెం మండలం బచ్చోడులో 17.3మి.మీ. అత్యధిక వర్షపాతం నమోదు కాగా, పెనుబల్లిలో 15.5, రఘునాథపాలెంలో 14.8, సత్తుపల్లి మండలం గంగారంలో 13.8, కొణిజర్ల మండలం పెదగోపతిలో 9.5, ఏన్కూరులో 8.3, వైరాలో 8, చింతకాని మండలం నాగులవంచ, ఖమ్మం నగరంలోని ప్రకాష్‌నగర్‌లో 5.3, ఖమ్మంరూరల్ మండలం పల్లెగూడెం, బోనకల్ మండలం రావినూతలలో 4.8, వేంసూరులో 4.5, ఏన్కూరు మండలం తిమ్మారావుపేటలో 3.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఇక జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు గరిష్ఠంగా నేలకొండపల్లిలో 38.4, కొణిజర్ల మండలం గుబ్బగుర్తిలో 36.4, ముదిగొండలో 36డిగ్రీల మేర నమోదయ్యాయి. కొద్దిరోజులుగా వానలు ముఖం చాటేయడంతో మెట్టపంటలు దెబ్బతింటున్నాయి. ప్రధానంగా పూత, కాత దశలో ఉన్న పత్తి వడబడుతోంది. వరి, పత్తి పైర్లు తెగుళ్ల బారిన పడుతున్నాయి. కాగా, బుధవారం నాటి వర్షం పైర్లకు కొంత మేలు చేస్తుందని రైతులు అంటున్నారు.

15వ బెటాలియన్‌ను సందర్శించిన అడిషనల్ డీజీపీ

అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం



వాటర్ సంప్ ప్రారంభిస్తున్న అడిషనల్ డీజీపీ స్వాతి లక్రా

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలం గంగారం 15వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌ను ఐపీఎస్ అధికారిణి, అడిషనల్ డీజీపీ స్వాతి లక్రా బుధవారం సందర్శించారు. బెటాలియన్‌లో నూతనంగా నిర్మించిన మిషన్ భగీరథ వాటర్ సంపు, ఏకలవ్య వెల్ఫేర్ కాంప్లెక్స్ ఆఫీసు, ద్విచక్ర వాహనాల పార్కింగ్ షెడ్, మినీ గెస్ట్‌హౌస్, నర్సరీలను ఆమె ప్రారంభించారు. బెటాలియన్‌లోని బీటీసీ ట్రెనింగ్ సెంటర్, బెటాలియన్ మైన్ ఆఫీసు, ఫైరింగ్ రేంజ్‌లను పరిశీలించారు. అధికారులు, సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం బెటాలియన్ ప్రాంగణంలో మొక్క నాటారు. కార్యక్రమంలో బెటాలియన్ కమాండెంట్ పి.వెంకట్‌రాములు, సహాయ దళాధిపతి ఆర్.నాగేశ్వరరావు, ఏసీపీ రామానుజం, సీఐ మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

జేవీఆర్ ఓసీ సందర్శన

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లిలోని జేవీఆర్‌ఓసీని మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ ఫారెస్ట్, క్లైమేట్ చేంజ్ డైరెక్టర్ కత్తుల తరుణ్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సంబంధిత అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో ఏరియా జీఎం శాలేం రాజు, ఎన్విరాన్‌మెంట్ జీఎం జేవీఎల్ గణపతి, జేవీఆర్‌ఓసీ పీఓ ఎస్.వెంకటాచారి, ఎస్‌ఓటూ జీఎం కోటిరెడ్డి, ఏజీఎం (సివిల్) రామకృష్ణ, కార్పొరేట్ ఎన్విరాన్‌మెంట్ అధికారులు రవికిరణ్, సీహెచ్ శ్రీనివాస్, ప్రాజెక్ట్ మేనేజర్ నర్సింహారావు, ప్రాజెక్ట్ ఇంజనీర్ లక్ష్మణమూర్తి, సత్యనారాయణ, సంతోష్ పాల్గొన్నారు.



జేవీఆర్‌ఓసీలో పరిశీలిస్తున్న తరుణ్

గుణాత్మక విద్య అందించాలి

డీఈఓ సోమశేఖర శర్మ

కొణిజర్ల : ఉపాధ్యాయులు గుణాత్మక విద్య అందించాలని జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ అన్నారు. మండలంలోని తనికెళ్ల గ్రేస్ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతీ ఉపాధ్యాయుడు శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అకడమిక్ మానిటరింగ్ అధికారి కె. రవికుమార్, రాష్ట్ర పరిశీలకులు శ్రీధరాచార్యులు, ఎంఈఓ శ్యాంసన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సోమశేఖరశర్మ

ఆదాయం ఉన్నా.. సౌకర్యాలు సున్నా!

- రిజిస్ట్రేషన్ శాఖకు సొంత భవనాలు కరువు
- ప్రభుత్వానికి అత్యధిక రాబడి సమకూరుస్తున్న శాఖ
- ఉమ్మడి జిల్లాలో మూడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకే ప్రభుత్వ భవనాలు
- మిగతా ఎనిమిది అద్దె భవనాల్లోనే..

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వానికి భారీగా ఆదాయాన్ని సమకూర్చే రిజిస్ట్రేషన్ శాఖ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కార్యాలయాలకు మాత్రం అద్దె చెల్లించాల్సి వస్తోంది. అనేక ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు ఉండగా.. రిజిస్ట్రేషన్ శాఖ మాత్రం సొంత భవనాలను సమకూర్చుకోలేకపోయింది. దీంతో అద్దె భవనాల్లోనే కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంతోపాటు చిట్ రిజిస్ట్రార్, ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అద్దె భవనాల్లోనే ఉన్నాయి. ఆయా కార్యాలయాల నుంచి ఏటా ప్రభుత్వానికి రూ.250 కోట్లకు పైగా ఆదాయం సమకూరుతోంది. ఆదాయం పెంపునకు మార్గాలను అన్వేషిస్తున్న ప్రభుత్వం.. శాఖ కార్యాలయాలకు మాత్రం సౌకర్యాలు కల్పించలేకపోతోంది. ఫలితంగా కార్యాలయాల్లోని ఫైళ్లు, ముఖ్య పత్రాలు దాచేందుకు స్థలం లేక.. అవి పాడవుతుంటే కాపాడలేక ఉద్యోగులు దిక్కుతోచని స్థితి ఎదుర్కొంటున్నారు.



అద్దెభవనంలో నిర్వహిస్తున్న ఖమ్మంరూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

అరకొర సౌకర్యాలతో..

వివిధ సేవల కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వచ్చే వినియోగదారుల సంఖ్య భారీగా పెరుగుతోంది. రియల్ ఎస్టేట్ వ్యాపారం, ఆస్తుల క్రయ విక్రయాలు పెరగడంతో రోజువారీ రిజిస్ట్రేషన్ల సంఖ్య పెరిగింది. ఫలితంగా శాఖకు వచ్చే ఆదాయం కూడా రెట్టింపైంది. అయితే ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలన్నీ ఇరుకు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. దీంతో విధులు నిర్వర్తించే ఉద్యోగులకే కాక రిజిస్ట్రేషన్ సేవల కోసం వచ్చే వినియోగదారులకూ ఇబ్బందులు తప్పడం లేదు. ఖమ్మం రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నగరంలోని రాపర్తినగర్ బైపాస్ రోడ్డు పక్కన అద్దె భవనంలో ఉంది. ఈ కార్యాలయంలో అధికారి, సిబ్బందికి పలు విభాగాలకు సరిపడా గదులు లేకపోవడంతో ఫొటోలు దింపే కంప్యూటర్ ఆపరేటర్.. సబ్ రిజిస్ట్రార్ క్యాబిన్ ముందే టేబుల్ ఏర్పాటు చేసుకుని సేవలందిస్తున్నారు. ఇక ఇతర సెక్షన్లన్నీ కలిపి ఒక గదిలోనే ఏర్పాటుచేశారు. ఈ కార్యాలయంలో సేవలు పొందేందుకు వచ్చిన వారికి కనీసం బాత్‌రూమ్ సౌకర్యం కూడా లేదు. పార్కింగ్ సౌకర్యం కూడా లేక రోడ్డు పక్కనే వాహనాలు నిలిపి పనులు చక్కబెట్టుకుంటున్నారు.

మూడే సొంత భవనాలు..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా.. మూడు మాత్రమే ప్రభుత్వ భవనాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. సత్తుపల్లి, మధిర, కొత్తగూడెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ప్రభుత్వ భవనాల్లో సేవలందిస్తుండగా.. ఖమ్మం జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం, చిట్‌రిజిస్ట్రార్, ఖమ్మం, ఖమ్మం రూరల్, కూసుమంచి, వైరా, కల్లూరు, ఇల్లెందు, పినపాక, భద్రాచలం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు స్థలాలు కేటాయించి శంకుస్థాపన చేసినా భవన నిర్మాణ పనులను చేపట్టలేదు. వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సొంత భవనం నిర్మించేందుకు 2016 జూన్ 12న శంకుస్థాపన చేయగా ఇంతవరకూ అడుగు ముందుకు పడలేదు. అలాగే జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంతోపాటు ఖమ్మం, ఖమ్మంరూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలను నిర్మించేందుకు ప్రభుత్వం ఖమ్మం రూరల్ మండలంలోని పోలేపల్లి వద్ద స్థలం కేటాయించింది. అక్కడ కూడా ఇప్పటి వరకు ఎలాంటి ప్రక్రియ ప్రారంభం కాలేదు.

నిధుల విడుదల లేకనే..

జిల్లాలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాల కోసం ప్రభుత్వం స్థలాలను కేటాయిస్తోంది. అయితే ఆ స్థలాల్లో భవనాలు నిర్మించేందుకు నిధులు మాత్రం కేటాయించడం లేదు. వైరాలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి ఏడేళ్ల క్రితం శంకుస్థాపన చేసినప్పటికీ ఇప్పటి వరకు భవన నిర్మాణానికి సంబంధించి రూపాయి కూడా విడుదల చేయలేదు. దీంతో కార్యాలయ శాశ్వత భవనం కలగానే మిగిలిపోయింది. ఇక పోలేపల్లిలో ఖమ్మంరూరల్, ఖమ్మం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు స్థలం కేటాయించినా నిధులు విడుదల చేయలేదు. ఉమ్మడి జిల్లాలోని మిగిలిన కార్యాలయాల పరిస్థితీ ఇలాగే ఉందని తెలుస్తోంది.

"సొంత భవనాలైతే ఇబ్బంది ఉండదు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత సొంత భవనాల అవసరం ఉంది. అద్దె భవనాల్లో కార్యకలాపాలు నిర్వహించాలంటే ఇబ్బంది అవుతోంది. ప్రతీ 10, 15 ఏళ్లకోసారి కార్యాలయాలను ఇతర భవనాల్లోకి మారుస్తుండడంతో ఫైళ్లు పాడవతుండడం అధికారులు, సిబ్బందికి ఇబ్బందికరంగా మారుతోంది. సొంత భవనాలైతే ఇలాంటి సమస్యలు రావు. ఇప్పటికే జిల్లాలో పలు భవనాల నిర్మాణాలకు ప్రభుత్వం స్థలం కేటాయించింది.

– చిట్టిమళ్ల అశోక్‌కుమార్, జిల్లా రిజిస్ట్రార్, ఖమ్మం

క్లుప్తంగా

యథావిధిగా రేషన్, స్పాట్ ఫీడింగ్

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం జిల్లాలో ఉన్న 1,840 మెయిన్, మినీ అంగన్‌వాడీలలో యథాతథంగా రేషన్, స్పాట్ ఫీడింగ్ అందిస్తామని జిల్లా సంక్షేమాధికారి టి.సుమ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 722 అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించి వివిధ సంఘాల్లో ఉన్న అంగన్‌వాడీటీచర్లు, హెల్పర్లు సమ్మెలో ఉన్నందున ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 25 వరకు లబ్ధిదారులకు టేక్ హోమ్ రేషన్ (టీహెచ్‌ఆర్) కింద బియ్యం, కందిపప్పు, నూనె, పాలు, కోడిగుడ్లు ఇచ్చామని, మిగిలిన 1,118 అంగన్‌వాడీ కేంద్రాల్లో స్పాట్ ఫీడింగ్ యథాతథంగా జరుగుతుందని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

రఘునాథపాలెం: మండలంలోని మంచుకొండ వద్ద ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి టాటా ఏస్ వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న కామేపల్లి మండలం బర్లగూడెం గ్రామానికి చెందిన బానోత్ పవన్‌కుమార్, ప్రమీల తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై బుధవారం రఘునాథపాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. గత నెల 7న బర్లగూడెం నుంచి ఖమ్మంలో బ్యాంక్ పనినిమిత్తం పవన్ కుమార్, ప్రమీల వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. బాధితుల తండ్రి వీరు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కోతుల దాడిలో యువతికి గాయాలు



అఖిల కాలుకు అయిన గాయం

వైరారూరల్: మండలంలోని నారపునేనిపల్లికి చెందిన యువతిపై కోతులు దాడిచేసి గాయపర్చిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. కనకపూడి అఖిల తన ఇంటి ఆవరణలో పనులు చేసుకుంటున్న సమయంలో కోతుల గుంపు ఒక్కసారిగా ఆమెపై దాడి చేసి కాలిని గాయపర్చాయి. గమనించిన కుటుంబ సభ్యులు కోతుల గుంపును తరిమేసి అఖిలను చికిత్స నిమిత్తం వైరాలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఇతర రాష్ట్రాల వాహనాలు సీజ్

నేలకొండపల్లి: మండలంలోని జాతీయ రహదారి పనులకు వినియోగిస్తున్న ఇతర రాష్ట్రాల వాహనాలను పన్నులు చెల్లించకపోవటంతో అధికారులు సీజ్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలో కోదాడ – కురవి జాతీయ రహదారి నిర్మాణ పనులకు వినియోగిస్తున్న ఇతర రాష్ట్రాలకు చెందిన క్రేన్, రెండు టిప్పర్లను మోటార్ వాహన అధికారి ఎ.వరప్రసాద్ సీజ్ చేశారు. నేలకొండపల్లి – కూసుమంచి రహదారిలో నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జి సమీపంలో బుధవారం వాహన తనిఖీలు చేస్తుండగా మూడు వాహనాలకు తెలంగాణ ప్రభుత్వం పన్నులు చెల్లించకుండా రవాణా చేస్తుండటంతో సీజ్ చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

వృద్ధుడి ఆత్మహత్య



మిద్దె రాములు (ఫైల్)

పెనుబల్లి: గడ్డి మందు తాగి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన మిద్దె రాములు (70) అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం గడ్డిమందు తాగాడు. గమనించిన చుట్టు పక్కల వారు రాములను పెనుబల్లి ప్రభుత్వ వైద్యశాలకు అక్కడి నుంచి ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాములు మృతి చెందాడు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ జి.సూరజ్ తెలిపారు.


రైలు ఢీకొని వ్యక్తి మృతి



సందీప్ (ఫైల్)

మధిర: ప్రమాదవశాత్తు రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం అర్ధరాత్రి మధిర రైల్వే స్టేషన్‌లో చోటుచేసుకుంది. జనగామలోని హెడ్ పోస్టాఫీస్ ప్రాంతానికి చెందిన యాసోజు విద్యాసాగర్, మంజుల దంపతులకు కుమారుడు సందీప్ (22), కుమార్తె ఉన్నారు. విధి నిర్వహణలో ఉండి తండ్రి చనిపోవడంతో కుమారుడు సందీప్‌కి ఉద్యోగం వచ్చింది. ఆయన ప్రస్తుతం మధిర ఎల్‌ఐసీ ఆఫీస్‌లో రికార్డు క్లర్క్‌గా పనిచేస్తూ.. తల్లి, సోదరితో కలిసి మధిరలోనే ఉంటున్నాడు. ఇటీవల సోదరికి వివాహం కావడంతో హనుమకొండకు నివాసం మార్చారు. మంగళవారం హనుమకొండ వెళ్లేందుకు మధిర రైల్వేస్టేషన్‌కు వచ్చి టికెట్ తీసుకునేందుకు రైల్వే ట్రాక్ దాటుతుండగా గుర్తుతెలియని రైలు ఢీకొట్టడంతో సందీప్ మృతి చెందాడు. ఈ ఘటనపై ఖమ్మం రైల్వే ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,026

కొనుగోలు లక్ష్యం పెరిగింది..

- జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు కార్యాచరణ
- ఈ ఏడాది లక్ష్యం 5 లక్షల మెట్రిక్ టన్నులు
- 236 కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు



ధాన్యం కాంటా వేస్తున్న హమాలీలు (ఫైల్)

ఖమ్మంసహకారనగర్: జిల్లాలో వానాకాలం (ఖరీఫ్) సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని పెంచారు. గత ఏడాది 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా.. ఈ ఏడాది 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించారు. ఇందుకోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. వచ్చే నెల (అక్టోబర్)లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించే అవకాశం ఉండగా.. అధికారులు ఇప్పటి నుంచే యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారు.

అంచనా ఇలా..

జిల్లాలోని 21 మండలాల పరిధిలో 1,05,033 హెక్టార్లలో వరి సాగు చేశారు. పంట దిగుబడి 6,67,000 మెట్రిక్ టన్నులుగా వస్తుందని అధికారులు భావిస్తున్నారు. ఇందులో స్థానిక అవసరాలు, మిల్లర్లు కొనుగోలు చేసేది మినహాయిస్తే కొనుగోలు కేంద్రాలకు 5 లక్షల మెట్రిక్ టన్నుల మేర తీసుకురావొచ్చని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఇందుకు అనుగుణంగా 236 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనుండగా, ఇందులో ఐకేపీ 50, పీఏసీఎస్ 152, డీసీఎంఎస్ 30, ఏఎంసీల ద్వారా నాలుగు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అలాగే, గన్నీ బ్యాగుల కొరత రాకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. మొత్తం 12,50,0000 గన్నీ బ్యాగ్‌లు అవసరం అవుతుండగా ఇందులో కొత్త గన్నీ బ్యాగ్‌లు కలిపి 57,71,492 అందుబాటులో ఉన్నాయి. గతేడాది 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు 234 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా 223 కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రాగా 28,06,18,760 మెట్రిక్ టన్నుల మేర కొనుగోలు చేశారు.

వివరాలు..	
లక్ష్యం	5 లక్షల మెట్రిక్ టన్నులు
కొనుగోలు కేంద్రాలు	236
గ్రేడ్–ఏ రకం క్వింటా ధర	రూ.2,203
కామన్ రకం క్వింటా ధర	రూ.2,183
గత ఏడాది కంటే..	రూ.143 పెంపు

పెరిగిన ధరలు

ధాన్యం మద్దతు ధరను పెంచుతూ ప్రభుత్వాలు నిర్ణయం తీసుకున్నాయి. గ్రేడ్–ఏ రకం ధాన్యం క్వింటాకు రూ.2,203, కామన్ రకం ధాన్యం క్వింటాకు రూ.2,183గా నిర్ణయించారు. గతంలో గ్రేడ్–ఏ క్వింటా ధర రూ.2,060 ఉండగా.. కామన్ రూ.2,040గా ఉంది. గతేడాది కంటే ఈ ఏడాది క్వింటాకు రూ.143 మేర పెరిగింది.

పకడ్బందీగా ఏర్పాట్లు

ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రభుత్వం పూర్తి ఏర్పాట్లు చేస్తోంది. కొనుగోలు సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ముందస్తుగానే కావాల్సిన సదుపాయాలన్నీ కల్పించేలా చర్యలు చేపడుతున్నారు. గన్నీ బ్యాగుల నుంచి కొనుగోళ్లు నిర్వహించే కేంద్రాల్లో కావాల్సిన టార్పాలిన్‌లు, మాయిశ్చర్ మీటర్లు, ధాన్యంలో తాలును వేరు చేసే మిషన్, కాంటాలు, ధాన్యంలో వచ్చే మట్టిని తొలగించే యంత్రం, జల్లెడలు, ఇతర పరికరాలను అందుబాటులో ఉంచుతున్నారు.

కార్యాచరణ సిద్ధం చేశాం..



జిల్లాలో ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలు చేసేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశాం. ఇప్పటికే వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించాం. గతం కంటే మద్దతు ధర ఈ ఏడాది రూ.143 పెరిగింది. రైతులు కొనుగోలు కేంద్రాలకు తరలించేలా అవగాహన కల్పిస్తున్నాం.

–డి.మధుసూదన్‌నాయక్, అదనపు కలెక్టర్

నేడు 23 నెలల ఎరియర్స్

కార్మికులకు చెల్లించనున్న సింగరేణి యాజమాన్యం



సింగరేణి కార్మికులు

సింగరేణి(కొత్తగూడెం): పదకొండో వేజ్‌బోర్డ్ ఎరియర్లను గురువారం కార్మికుల బ్యాంకు ఖాతాల్లో సింగరేణి యాజమాన్యం జమచేయనుంది. సంస్థవ్యాప్తంగా అధికమొత్తం ఎరియర్స్ పొందే 10 మంది కార్మికుల వివరాలను యాజమాన్యం బుధవారం వెల్లడించింది. రామగుండం–1 ఏరియా (జీడీకే–11ఏ)కు చెందిన హెడ్ ఓవర్‌మెన్ వేముల సుదర్శన్ రెడ్డి సంస్థవ్యాప్తంగా అత్యధికంగా ఎరియర్స్ పొందనున్నాడు. రూ.9,91,957 ఎరియర్స్ రానుండగా, అందులో పీఎఫ్, ఆదాయ పన్ను తదితర రికవరీ రూ.3,64,934 పోగా, రూ.6,27,023 బ్యాంక్‌లో జమ అవుతాయి. ఆ తర్వాత రామగుండం–1 ఏరియా జీడీకే–2 ఇంక్‌లైన్‌కు చెందిన దోమల సుధాకర్ (ఎలక్ట్రికల్ ఫోర్‌మెన్) రూ.9,02,577 ఎరియర్స్ పొందనుండగా, రూ. 2,77,709 రికవరీ పోను రూ.6,24,868 ఖాతాలో జమ చేస్తారు. మిగతా 8 మంది కూడా రామగుండం, శ్రీరాంపూర్ ఏరియాలకు చెందిన కార్మికులే ఉన్నారు. కొత్తగూడెం ఏరియాలోని జేవీఆర్ ఓసీ–2కు చెందిన ఈపీ ఆపరేటర్ దొండపాటి అజయ్‌కుమార్ 7,66,954 ఎరియర్స్‌లో రూ.2,24,698 రికవరీ పోను, రూ.542,256 అందుకోనున్నాడు. ఈయన సంస్థ వ్యాప్తంగా 11వ స్థానంలో ఉండగా, భద్రాద్రి జిల్లాలో అత్యధిక ఎరియర్స్ అందుకునే కార్మికుడిగా నిలిచాడు. వీరిందరినీ గురువారం ఆయా జీఎం కార్యాలయాల్లో సన్మానించనున్నారు. ఎరియర్ల సొమ్మును వృథా చేయకుండా, సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా సింగరేణి డైరెక్టర్(పా) ఎన్.బలరామ్ కార్మికులకు సూచించారు.

18వ శతాబ్దపు రాగి నాణేలు సీజ్



పోలీసులు స్వాధీనం చేసుకున్న రాగి సీతారాముల నాణేలు

మణుగూరుటౌన్: పాత రాగి సీతారాముల నాణేలకు రసాయనాలు పూస్తే వచ్చే శక్తులతో అధిక డబ్బులు సంపాదించవచ్చునని ఆశ చూపి బురిడీ కొట్టించబోయిన వ్యక్తులను మణుగూరు పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ ఐదుగురు వ్యక్తులు తమ వద్ద ఉన్న 18వ శతాబ్దానికి చెందిన రాగి సీతారాముల నాణేలకు రసాయనాలు పూసి పూజలు చేస్తే వాటికి అతీత శక్తులు వస్తాయని నమ్మబలికారు. దీంతో మణుగూరుకు చెందిన ఇద్దరు వ్యక్తులు అందుకు అంగీకరించగా, ఆ వ్యక్తులు బుధవారం పూలమార్కెట్ ఏరియాలో పూజలు చేస్తున్నారు. సీఐ బాలాజీ వరప్రసాద్ ఆదేశాల మేరకు ఎస్‌ఐ శ్రీనివాస్ వారిని అదుపులోకి తీసుకుని రాగి నాణేలను సీజ్ చేశారు. కాగా, నాణేలు 18వ శతాబ్దానికి చెందినవి కావడంతో ట్రెజరీకి చేరాల్సి ఉండగా, వాటిని తహసీల్దార్ రాఘవరెడ్డికి అందించినట్లు తెలిపారు. ఎవరిపై కేసు నమోదు చేయలేదని తహసీల్దార్ పరిశీలన అనంతరం చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

నాటుసారా తరలిస్తున్న వ్యక్తుల అరెస్టు



నాటుసారా తరలిస్తూ పట్టుబడిన వ్యక్తులు

దుమ్ముగూడెం: సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి తెలంగాణలోకి నాటుసారాను తరలిస్తున్న నలుగురు వ్యక్తులను దుమ్ముగూడెం పోలీసులు అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఎస్‌ఐ కేశవరావు నేతృత్వంలో పోలీసులు మంగళవారం రాత్రి సీతానగరం, గోవిందాపురం గ్రామాలను సందర్శించేందుకు వెళ్లిన సందర్భంలో రెండు ద్విచక్రవాహనాలపై నలుగురు వ్యక్తులు వస్తూ పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశారు. వారిని పోలీసులు వెంబడించి అదుపులోకి తీసుకొని కనితి అజయ్, మడకం ధర్మ, మడకం సర్వేశ్, కంగాల రమేశ్‌గా గుర్తించారు. ఛత్తీస్‌గఢ్‌లో తక్కువ ధరకు దొరుకుతున్న నాటు సారాను కొనుగోలు చేసి తెలంగాణలో విక్రయిస్తున్నట్లు అంగీకరించడంతో వారి వద్ద నుంచి 60 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గణేశ్ తెలిపారు.

చోరీకి యత్నం



చెల్లాచెదురుగా పడి ఉన్న వస్తువులు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని లంబాడాకాలనీలోని తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి యత్నించారు. వివరాలిలా ఉన్నాయి.. కాలనీకి చెందిన చలపతిరావు ఈ నెల 15న ఇంటికి తాళం వేసి వేరే ప్రాంతానికి వెళ్లాడు. ముందస్తుగా పోలీసులకు కూడా సమాచారం ఇచ్చి వెళ్లినట్లు తెలిసింది. బుధవారం ఇంటికి వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉండటంతో లోపల పరిశీలించగా వస్తువులన్నీ చిందరవందరగా పడిఉన్నాయి. వెంటనే ఆయన పోలీసులకు విషయం చెప్పడంతో వారు క్లూస్ టీంతో వచ్చి పరిశీలించారు. కాగా, ఇంట్లో నగదు, బంగారం లేకపోవడంతో చలపతిరావు, అతడి కుటుంబ సభ్యులు ఊపిరిపీల్చుకున్నారు. కాగా, పట్టణ ప్రజలు వ్యక్తిగత పనులపై ఇతర ప్రాంతాలకు వెళ్తే స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని ఇటీవలే భద్రాచలంటౌన్ పోలీసులు ప్రకటన విడుదల చేశారు. ఈ ఘటనపై టౌన్ సీఐ నాగరాజురెడ్డిని వివరణ కోరగా రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ కట్టుదిట్టంగా నిర్వహిస్తున్నామని, చోరీకి యత్నించినవారిని త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.

మా పిల్లలను వేరే పాఠశాలకు పంపించొద్దు..

గురుకుల పాఠశాల ఎదుట తల్లిదండ్రుల ఆందోళన



ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

రఘునాథపాలెం: క్రమశిక్షణ చర్యల కిందట తమ పిల్లలను మరో పాఠశాలకు పంపించొద్దని కోరుతూ విద్యార్థుల తల్లిదండ్రులు సదరు పాఠశాల ఎదుట ఆందోళనకు దిగారు. బుధవారం చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి.. గురుకుల పాఠశాలలో సమస్యలున్నాయని కలెక్టర్‌కు చెప్పేందుకు ఈ నెల 12న అర్ధరాత్రి గోడ దూకి విద్యార్థులు కలెక్టరేట్‌కు వెళ్లారు. ఆలస్యంగా గుర్తించిన బీసీ గురుకులం అధికారులు వారు కలెక్టరేట్ వద్ద ఉన్నారని తెలుసుకుని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి తిరిగి పాఠశాలకు తీసుకొచ్చారు. విషయం బయటకు పొక్కడంతో వివిధ తరగతుల్లోని 20 మంది విద్యార్థులను క్రమశిక్షణ చర్య కింద జిల్లాలోని వైరా, బోనకల్, కుంచపర్తి, కూసుమంచిలోని గురుకులాలకు పంపించారు. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. కనీసం దుప్పట్లు, పుస్తకాలు, దుస్తులు, బకెట్లు వంటివి ఏమీ లేకుండా పంపడంతో విద్యార్థులు అక్కడ నానా అవస్థలు పడుతున్నారని వారు తెలిపారు. క్రమశిక్షణ చర్య కింద పంపారని చెబితే తోటి విద్యార్థులు దొంగల మాదిరి చూశారని వాపోయారు. ఇంత జరిగినా తల్లిదండ్రుల సమావేశం ఎందుకు పెట్టలేదని, తమ పిల్లలను వేరే చోటుకు మార్చిన విషయం తమకు ఎందుకు చెప్పలేదంటూ నిలదీశారు. తమ పిల్లలను తిరిగి ఇక్కడే ఉంచాలని ప్రిన్సిపాల్ సంజీవరావును కోరారు. అయినా ప్రిన్సిపాల్ ససేమిరా అనడంతో తల్లిదండ్రులు నిరసన తెలిపారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం వారి భోజనాన్ని ఆయా పాఠశాలలకు మార్చామని, ఈ నిర్ణయం తన పరిధిలో లేదని తెలిపారు.

ఆన్‌లైన్ మోసం

రూ.1.09 లక్షలు పోగొట్టుకున్న వ్యక్తి

కూసుమంచి: సోషల్ మీడియాలో గుర్తుతెలియని వ్యక్తులు పంపిన ప్రకటన చూసి ఓ వ్యక్తి రూ.1.09 లక్షలు పోగొట్టుకున్న ఘటన వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ రమేశ్‌కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని నాయకన్‌గూడెం గ్రామానికి చెందిన చిలకబత్తిని వెంకటేశ్వర్లు ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గత నెలలో అతను సోషల్ మీడియాలో ఓ ప్రకటన చూసి అందులోని టాస్క్‌లు పూర్తి చేశాడు. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు పంపిన లింక్‌లను క్లిక్‌చేసి లింకులో ఉన్న సూచన మేరకు అదనపు ఆదాయం కోసం రూ.1.09 లక్షలు డిపాజిట్ చేశాడు. కాగా, అతను పూర్తిచేసిన టాస్క్‌లకు డబ్బు రాకపోగా తాను డిపాజిట్ చేసిన నగదు కూడా పోయినట్లు వెంకటేశ్వర్లు గ్రహించాడు. వెంటనే అతడు సైబర్ క్రైమ్ పోర్టల్ 1930కి డయల్ చేసి ఫిర్యాదు చేయగా అతను చెల్లించిన డిపాజిట్ నుంచి రూ.59 వేలు హోల్డ్ చేశామని ఎస్‌ఐ వివరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రహదారి బాగా లేక అందని వైద్యం



గ్రామానికి వెళ్లే రహదారి



రాధ మృతదేహం

పాముకాటుతో మహిళ మృతి

బూర్గంపాడు: పాము కాటుకు గురైన ఆదివాసీ మహిళను భద్రాచలం తరలించేందుకు గ్రామం నుంచి సరైన రహదారి లేకపోవడంతో మార్గమధ్యలోనే మృతిచెందింది. ఈ ఘటన సారపాక శివారు ప్రాంతమైన శ్రీరాంపురం ఎస్టీకాలనీలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. అటవీప్రాంతంలోని శ్రీరాంపురం ఎస్టీ కాలనీకి చెందిన వెట్టి రాధ (30) మంగళవారం ఇంట్లో నిద్రిస్తుండగా పాము కాటు వేసింది. ఆమెను కుటుంబసభ్యులు, గ్రామస్తులు భద్రాచలం తరలిస్తున్న క్రమంలో మృతిచెందింది. సరైన రహదారి సౌకర్యం లేకపోవటంతోనే ఆమెను సకాలంలో ఆస్పత్రికి తరలించలేకపోయామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి వెళ్లేందుకు కనీసం గ్రావెల్‌రోడ్డు కూడా లేకపోవటంతో ప్రాణాపాయ పరిస్థితుల్లో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. మృతురాలికి భర్త సమ్మయ్య, ముగ్గురు పిల్లలున్నారు. రాధ మృతితో శ్రీరాంపురం ఎస్టీకాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతురాలి కుటుంబానికి బీఎస్‌ఎస్‌ఎం రాష్ట్ర చైర్మన్ మద్దిశెట్టి సామేలు రూ.5 వేలు ఆర్థిక సాయం చేశారు. బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు కేవీ రమణ నివాళులర్పించారు.

వైద్యం వికటించి బాలుడు మృతి

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెం పట్టణంలోని సూర్య చిన్నపిల్లల ఆస్పత్రిలో వైద్యం వికటించి బాలుడు మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. బాలుడి తల్లిదండ్రుల కథనం ప్రకారం.. కొత్తగూడెం పట్టణంలోని కూలీలైన్‌కు చెందిన క్లాపల్లి రాజు కుమారుడు వైష్ణు (8)కు మంగళవారం జర్వం రాగా సూర్య ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఇంజక్షన్ వేయడంతో బాలుడిని ఇంటికి తీసుకెళ్లారు. రాత్రి 7 గంటల కు బాలుడి పరిస్థితి విషమించడంతో మళ్లీ ఆస్పత్రికి తీసుకొచ్చారు. అక్కడి నుంచి హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. అనంతరం బాలుడి బంధువులు ఆస్పత్రి వద్ద ఆందోళన చేశారు. వైద్యం వికటించటం వల్లే వైష్ణు మృతిచెందాడని వారి తల్లిదండ్రులు ఆస్పత్రి యాజమాన్యంతో ఘర్షణకు దిగారు.

గ్రానైట్ కార్మికుల మధ్య ఘర్షణ

ఖమ్మంరూరల్: మండలంలోని ఆరెంపుల గ్రామ పరిధిలోని ఓ గ్రానైట్ ఫ్యాక్టరీలో కార్మికుల మధ్య బుధవారం ఘర్షణ చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికుల నడుమ ఘర్షణ చోటుచేసుకోగా కోపోద్రిక్తులైన కొంతమంది కార్మికులు పశ్చిమబెంగాల్‌కు చెందిన ఓ కార్మికుడి మలద్వారంలో పాలిషింగ్ ఎయిర్ పైప్ పెట్టి గాలి ఎక్కించారు. దీంతో సదరు కార్మికుడి పొట్ట అంతా గాలితో నిండిపోయి ఊపిరాడక తీవ్ర అస్వస్థకు గురయ్యాడు. వెంటనే అతడిని ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో మమత వైద్యశాలకు తరలించారు. ప్రస్తుతం కార్మికుడు వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్లు తెలిసింది. పోలీసులను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

నలుగురిపై కేసు

కామేపల్లి: పాతకక్షల నేపథ్యంలో పండితాపురం గ్రామానికి చెందిన బొమ్మగాని పిచ్చయ్యపై అదే గ్రామానికి చెందిన చల్లా శశి, అప్పారావు, లాలయ్య, మేకపోతుల సైదులు దాడి చేశారు. ఈ ఘటనపై బుధవారం బాధితుడి తండ్రి వెంకయ్య ఫిర్యాదు మేరకు దాడి చేసిన నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

గంజాయి స్వాధీనం

కల్లూరు: కల్లూరులో 7.295 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. కల్లూరు మండల పరిధిలోని గనియాతండా గ్రామంలో గల రామ్‌దాస్ ఫ్రూట్ ట్రేడర్స్ ఐరన్ షెడ్‌లో విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం పోలీసులు సోదాలు నిర్వహించారు. ఘటనా స్థలంలో ఖాళీ మామిడి పెట్టెల మధ్య ఉన్న సుమారు 7.295 కేజీల (నాలుగు ప్యాకెట్లు) గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.1.05 లక్షలు ఉంటుందని ఎస్‌ఐ రఘు తెలిపారు.

అలా దాస్తారు..

న్యూఢిల్లీలోని గుజరాత్‌కాలనీకి చెందిన మోతి, రాజేశ్, మరి కొందరికి గంజాయి సేవించడం, విక్రయించడం అలవాటు. వారు పనికి వెళ్లిన ప్రాంతాల్లో గుట్టు చప్పుడు కాకుండా గంజాయిని తెచ్చి విక్రయిస్తారు. సేవిస్తారు. అలా సుమారు మూడు నెలల కిందట రాందాసు మామిడి మార్కెట్ యార్డులో పనిచేసేందుకు వచ్చినప్పుడు దాచిన 4 ప్యాకెట్ల గంజాయిని పట్టుకుని సీజ్ చేసి, మంగళవారం అర్ధరాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఖమ్మంలో..

ఖమ్మంక్రైం: నగరంలోని టూటౌన్ పరిధిలో ఓ వ్యక్తి నుంచి పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకున్న ఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. ఒడిశా రాష్ట్రానికి చెందిన సర్కార్ ఖమ్మానికి 2 కేజీలకు పైగా గంజాయి తీసుకొచ్చి చౌదరి హోటల్ సమీపంలో విక్రయిస్తుండగా టూటౌన్ సీఐ కుమారస్వామి అతడిని పట్టుకున్నాడు. గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన వ్యక్తిపై కేసు

తల్లాడ: పెళ్లి చేసుకుంటానని మాయమాటలతో సహజీవనం చేసి తనను గర్భవతిని చేసి వదిలేశాడని తల్లాడకు చెందిన ఓ యువతి స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ పి.సురేశ్ కథనం ప్రకారం.. పెళ్లయి భర్తతో విడాకులైన ఓ యువతి తల్లాడలో ఒంటరిగా ఉంటోంది. ఏన్కూరు మండలం జన్నారం గ్రామానికి చెందిన వేముల లక్ష్మయ్య సదరు యువతికి మాయమాటలు చెప్పి సహజీవనం చేశాడు. ఆ యువతి గర్భం దాల్చడంతో లక్ష్మయ్య ఆమెను వదిలేశాడు. సదరు యువతి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సురేశ్ లక్ష్మయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ ఢీకొని వృద్ధుడు మృతి

పెనుబల్లి: ద్విచక్రవాహనం ఢీ కొని వృద్ధుడు మృతి చెందిన ఘటన మండలంలోని లంకాసాగర్ క్రాస్ రోడ్డు వద్ద బుధవారం రాత్రి చోటు చేసుకుంది. మండలంలోని లంకపల్లికి చెందిన కొత్తపల్లి శివయ్య తన ద్విచక్రవాహనంపై వీఎం బంజర్ వెళ్తున్నాడు. మార్గమధ్యలో లంకాసాగర్ క్రాస్ రోడ్డుపై వెళ్తున్న ఈశ్వర శర్మ (70)ను ఢీ కొట్టాడు. దీంతో అతడు తీవ్రంగా గాయపడగా పెనుబల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈశ్వరశర్మ అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈశ్వరశర్మ పదేళ్లుగా యాచిస్తూ జీవిస్తున్నాడని, రాజమండ్రి ప్రాంతానికి చెందినవాడని స్థానికులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సూరజ్ తెలిపారు.

స్కిల్ కుంభకోణం బాబు ఆలోచనల నుంచే

అంతిమ లబ్ధిదారులు చంద్రబాబు, ఆయన సంబంధీకులే

- ఆయన నుంచి మరింత సమాచారాన్ని రాబట్టాల్సి ఉంది..
- పోలీసు కస్టడీకి ఎందుకు భయపడుతున్నారో అర్థం కావట్లేదు
- నిందితుడు న్యాయస్థానాన్ని శాసించలేడు
- 5 రోజులు పోలీసు కస్టడీకి ఇవ్వాలని ఏసీబీ కోర్టును అభ్యర్థించిన సీఐడీ న్యాయవాదులు
- కోర్టును శంకించేలా కౌంటర్ దాఖలు చేసిన చంద్రబాబు న్యాయవాదులు
- కేసును తాము విచారించడంపై అభ్యంతరం ఉందా? అని ప్రశ్నించిన న్యాయస్థానం
- తాము సర్టిఫై చేయాల్సిన అవసరం లేదన్న బాబు న్యాయవాదులు
- నేడు తీర్పు వెలువరిస్తామన్న న్యాయస్థానం

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో మాజీ సీఎం చంద్రబాబు నుంచి మరింత సమాచారాన్ని రాబట్టేందుకు ఐదు రోజుల పాటు తమ కస్టడీకి అప్పగించాలంటూ సీఐడీ దాఖలు చేసిన పిటిషన్‌లో వాదనలు ముగిశాయి. దాదాపు మూడున్నర గంటల పాటు వాదనలు విన్న ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం దీనిపై గురువారం తీర్పు వెలువరిస్తామని ప్రకటించింది. అంతకు ముందు సీఐడీ తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ చంద్రబాబు ఆలోచనల నుంచే స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం పుట్టిందని కోర్టుకు నివేదించారు. దీనికి సంబంధించిన ప్రతి విషయం ఆయనకు తెలుసని, ఈ కుంభకోణంలో అంతిమ లబ్ధిదారులు చంద్రబాబుతో పాటు ఆయనకు సంబంధించిన వ్యక్తులేనని నివేదించారు. తమ వద్ద ఉన్న ఆధారాలను దగ్గర పెట్టుకుని చంద్రబాబును విచారించాల్సిన అవసరం ఉందన్నారు. ఇంత పెద్ద కుంభకోణంలో 24 గంటల్లో దర్యాప్తు పూర్తి చేయడం సాధ్యం కాదన్నారు. చంద్రబాబును తాము (సీఐడీ) విచారిస్తే ఆయనకు వచ్చిన నష్టం ఏమీ ఉండదని, అదే తాము విచారించకుంటే దర్యాప్తునకు తీరని నష్టం కలుగుతుందని పేర్కొన్నారు. పోలీసు కస్టడీకి ఎందుకు భయపడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. విచారిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి కాబట్టే చంద్రబాబు పోలీసు కస్టడీని వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. నిందితుడు కోర్టును అలా చేయడానికి వీల్లేదు, ఇలా చేయడానికి వీల్లేదని శాసించలేడన్నారు. నిందితుడు ముందు న్యాయం మోకరిల్లరాదని, ఒకవేళ అలా జరిగితే వ్యవస్థ కుప్పకూలినట్లేనన్నారు. విచారణలో మౌనంగా ఉండే హక్కు నిందితుడికి ఉందని, అయితే విచారణకు సహకరించాల్సిన బాధ్యత కూడా నిందితుడిపై ఉందని కోర్టుకు నివేదించారు. ఈ కుంభకోణాన్ని రాజకీయ కారణాలతో వెలికి తీసినట్లు చంద్రబాబు న్యాయవాదులు చెబుతున్నారని, వాస్తవానికి దీన్ని పుణె జీఎస్టీ అధికారులు వెలికి తీశారని తెలిపారు. ఈ కుంభకోణానికి సంబంధించిన వివరాలను జీఎస్టీ అధికారులు అప్పటి రాష్ట్ర ప్రభుత్వం (టీడీపీ సర్కారు) దృష్టికి తెచ్చారని, కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఎలా దారి మళ్లించారో వివరించారని చెప్పారు. అప్పటి చంద్రబాబు ప్రభుత్వం నామమాత్రపు చర్యలతో జీఎస్టీ అధికారులు ఇచ్చిన సమాచారాన్ని తొక్కిపెట్టిందని తెలిపారు. ఆ తరువాత షెల్ కంపెనీల గుట్టు రట్టు కావడంతో కేంద్ర దర్యాప్తు సంస్థలు రంగంలోకి దిగి వాటితో సంబంధం ఉన్న వారందరికీ నోటీసులు జారీ చేశాయని చెప్పారు. ఐటీ శాఖ నోటీసులు ఇవ్వగానే చంద్రబాబుకు అత్యంత సన్నిహితులైన ఇద్దరు వ్యక్తులు విదేశాలకు పారిపోయారని కోర్టు దృష్టికి తెచ్చారు. ప్రజాధనంతో ముడిపడి ఉన్న ఇలాంటి కేసును రాజకీయ ప్రేరేపితం, కక్ష సాధింపు అనడం దారుణమన్నారు. చంద్రబాబు పాత్రకు సంబంధించిన ఆధారాలను సేకరించేందుకు ఒకటిన్నర సంవత్సరం పట్టిందని, దీన్ని బట్టి ఎంత పకడ్బందీగా ఈ కుంభకోణానికి వ్యూహరచన చేశారో అర్థం చేసుకోవాలని కోర్టును కోరారు. చంద్రబాబును విచారణ నిమిత్తం తమ కస్టడీకి ఇవ్వాలని అభ్యర్థించారు.

మేం సర్టిఫై చేయాల్సిన అవసరం లేదు..

ఏసీబీ కోర్టు కేసు విచారణ మొదలు కాగానే సీఐడీ కస్టడీ పిటిషన్‌లో చంద్రబాబు దాఖలు చేసిన కౌంటర్‌ను పరిశీలించింది. అందులో కోర్టును శంకించేలా పేర్కొన్న అంశాలపై అభ్యంతరం తెలిపింది. చంద్రబాబు న్యాయవాదుల తీరుతో ఒకింత మనస్తాపం చెందిన కోర్టు.. ఈ కేసును తాము విచారించడంపై మీకేమైనా అభ్యంతరం ఉందా? అంటూ సీఐడీ న్యాయవాదులను ప్రశ్నించింది. నిబంధనల ప్రకారం విచారణ జరుపుతున్న నేపథ్యంలో తమకు అభ్యంతరం లేదని సీఐడీ న్యాయవాదులు చెప్పారు. ఇదే ప్రశ్నను చంద్రబాబు తరఫు న్యాయవాదులను కోర్టు అడిగినప్పటికీ వారు మౌనంగా ఉన్నారు. అయినప్పటికీ కోర్టు మరో సారి అడగటంతో.. తాము సర్టిఫై చేయాల్సిన అవసరం లేదంటూ చంద్రబాబు తరఫు న్యాయవాదులు ఒకింత తీవ్ర స్వరంతో బదులిచ్చారు. దీంతో కోర్టు విచారణను ప్రారంభించింది.

ఇప్పుడు కస్టడీ కోరడం ఏమిటి?

చంద్రబాబు తరఫున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ లూథ్రా, సిద్ధార్థ అగర్వాల్ వాదనలు వినిపిస్తూ.. ఇప్పటికే అన్ని ఆధారాలు సేకరించామని, వాటి ఆధారంగా చంద్రబాబును జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపాలని సీఐడీ మొదటి రోజే కోర్టును కోరిందని పేర్కొన్నారు. అన్ని ఆధారాలు సేకరించినప్పుడు ఇప్పుడు తిరిగి పోలీసు కస్టడీకి తీసుకుని విచారించాల్సిన అవసరం ఏముందన్నారు. స్కిల్ కేసులో 2021లో ఎఫ్ఐఆర్ నమోదు చేసి, 2023లో చంద్రబాబును అరెస్ట్ చేసిందని, ఇంత కాలం సీఐడీ ఏం చేస్తున్నట్లని ప్రశ్నించారు. వారి అలసత్వానికి చంద్రబాబును కస్టడీకి కోరడానికి వీల్లేదన్నారు. 45 ఏళ్లుగా చంద్రబాబు కాపాడుకుంటూ వచ్చిన ప్రతిష్టను కాలరాసేందుకే సీఐడీ ఆయన్ను కస్టడీకి ఇవ్వాలని కోరుతోందన్నారు. సిట్ కార్యాలయంలో చంద్రబాబును విచారిస్తున్న సమయంలో దర్యాప్తు అధికారులు ఆ వివరాలను మీడియాకు లీక్ చేశారని తెలిపారు. చంద్రబాబు ఎమ్మెల్యే కాబట్టి సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ఈ కేసు మొత్తం ఎంపీ, ఎమ్మెల్యేల కేసులను విచారించే ప్రత్యేక కోర్టుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కేసును విచారించే పరిధి ఏసీబీ కోర్టుకు లేదన్నారు.

పరిధి లేకుంటే ఎందుకీ పిటిషన్లు?

దీనికి సీఐడీ తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ సుధాకర్‌రెడ్డి, స్పెషల్ పీపీ వివేకానంద తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఎంపీ, ఎమ్మెల్యేల కేసులను విచారించే ప్రత్యేక కోర్టులు.. ప్రజా ప్రతినిధులు నిందితులుగా ఉన్న కేసుల్లో చార్జిషీట్ దాఖలైన తరువాత ట్రయల్ మొదలు పెట్టి విచారణ కొనసాగించేందుకు మాత్రమే ఉద్దేశించినవన్నారు. రిమాండ్ విషయంలో ఆ కోర్టులు జోక్యం చేసుకోలేవన్నారు. ఒకవేళ ఏసీబీ కోర్టుకు విచారణ పరిధి లేదని భావిస్తే ఆ విషయాన్ని మొదటే చెప్పి ఉండాల్సిందన్నారు. ఏసీబీ కోర్టుకు విచారణ పరిధి లేకుంటే హౌస్ రిమాండ్, బెయిల్, మధ్యంతర బెయిల్ ఇలా ఇన్ని పిటిషన్లు ఎలా దాఖలు చేస్తారని ప్రశ్నించారు. ఒకవైపు పరిధి లేదంటూనే మరో వైపు ఇన్ని పిటిషన్లు వేయడం చంద్రబాబు తీరును తెలియచేస్తోందన్నారు.

ఆ దృశ్యాలతో మాకేం సంబంధం లేదు..

ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం.. విచారణ దృశ్యాలు మీడియాలో రావడంపై ప్రశ్నించింది. ఆ దృశ్యాలను తాము లీక్ చేశామంటున్న చంద్రబాబు న్యాయవాదులు అందుకు ఆధారాలుంటే చూపాలని సీఐడీ స్పెషల్ పీపీ వివేకానంద కోరారు. ఆ దృశ్యాలు మీడియాలో ఎలా వచ్చాయో, వాటిని ఎవరు చిత్రీకరించారో తమకు తెలియదన్నారు. విచారణ రోజు చంద్రబాబును ఆయన కుటుంబ సభ్యులు, సహాయకులు కూడా కలిశారని కోర్టు దృష్టికి తెచ్చారు.

బాబు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ వాయిదా

సాక్షి, అమరావతి: అన్నమయ్య జిల్లా అంగళ్లు వద్ద జరిగిన విధ్వంసానికి సంబంధించి ముదివేడు పోలీసులు నమోదు చేసిన కేసులో బెయిల్ కోరుతూ టీడీపీ అధినేత చంద్రబాబు హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ శుక్రవారానికి వాయిదా పడింది. ఈ పిటిషన్‌పై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేశ్‌రెడ్డి బుధవారం విచారణ జరిపారు. అదనపు ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్నందున విచారణను గురువారానికి వాయిదా వేయాలని ఆయన తరఫు జూనియర్ న్యాయవాది కోర్టును కోరారు. శుక్రవారానికి వాయిదా వేయాలని చంద్రబాబు తరఫు న్యాయవాది కోరారు. వాదనలను విన్న న్యాయమూర్తి విచారణను శుక్రవారానికి వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. యుద్ధభేరి పేరుతో చంద్రబాబు చేపట్టిన సాగు నీటి ప్రాజెక్టుల సందర్శన సందర్భంగా అన్నమయ్య జిల్లా అంగళ్లు వద్ద టీడీపీ శ్రేణులు విధ్వంసానికి దిగాయి. ఈ విధ్వంసాన్ని చిత్తూరు జిల్లా పుంగనూరు వరకు కొనసాగించాయి. పుంగనూరు ఘటనలో 40 మందికి పైగా పోలీసులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ కేసులో చంద్రబాబు ప్రధాన నిందితుడిగా ఉన్నారు.

వైఎస్ భాస్కర్‌రెడ్డికి 12 రోజులు మధ్యంతర బెయిల్

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అరెస్టయిన వైఎస్ భాస్కర్‌రెడ్డికి హైదరాబాద్ ప్రత్యేక సీబీఐ న్యాయస్థానం 12 రోజుల మధ్యంతర బెయిల్‌కు అనుమతిచ్చింది. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నానని, 15 రోజుల పాటు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోరుతూ భాస్కర్‌రెడ్డి ప్రత్యేక సీబీఐ కోర్టులో ఈనెల 9న పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఇరు పక్షాల వాదనలు ముగియడంతో సీబీఐ కోర్టు బుధవారం ఉత్తర్వులు వెలువరించింది. భాస్కర్‌రెడ్డికి వైద్య పరీక్షల నిమిత్తం ఈ నెల 22న ఉదయం 10 గంటల నుంచి వచ్చే నెల 3వ తేదీ ఉదయం 10.30 గంటల వరకు ఎస్కార్ట్ బెయిల్ మంజూరు చేసింది. హైదరాబాద్‌లో ఆరోగ్య పరీక్షలు చేయించుకునేందుకు అనుమతిచ్చింది. ఈ 12 రోజులు నగరం విడిచి వెళ్లకూడదని స్పష్టం చేసింది. ముగ్గురు కానిస్టేబుళ్లు, ఒక సబ్ ఇన్‌స్పెక్టర్‌తో ఎస్కార్ట్ ఇవ్వాలని జైలు సూపరింటెండెంట్‌ను ఆదేశించింది. ఈ నెల 22న భాస్కర్‌రెడ్డిని ఎస్కార్ట్ పోలీసులకు అప్పగించాలని తెలిపింది. అలాగే వచ్చే నెల 3న ఎస్కార్ట్ పోలీసులు జైలు సిబ్బందికి తిరిగి ఆయన్ని అప్పగించాలని ఆదేశించింది.

విశాఖలోనూ సీఎం క్యాంపు కార్యాలయం

- దసరా పండుగ రోజున అక్కడి నుంచి పరిపాలనకు శ్రీకారం
- మంత్రులతో స్పష్టం చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: విశాఖపట్నం కేంద్రంగా పరిపాలన ఎప్పుడు మొదలవుతుందనే అంశంపై కొంత కాలంగా సాగుతున్న చర్చకు సీఎం వైఎస్ జగన్ తెరదించారు. విశాఖపట్నంలోనూ సీఎం క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేసి, దసరా నుంచి పరిపాలన ప్రారంభిద్దామని మంత్రులతో స్పష్టం చేశారు. సీఎం కార్యాలయం మొదలు వివిధ శాఖల కార్యాలయాల ఏర్పాటుకు భవనాలను గుర్తించేందుకు అధికారులతో ఒక కమిటీ వేస్తామని చెప్పారు. ఇక్కడి నుంచి విశాఖపట్నంకు కార్యాలయాల తరలింపునకు అధికారులతో మరో కమిటీ వేస్తామన్నారు. దసరాలోగా కార్యాలయాలను తరలించి.. పండుగ రోజునే విశాఖ కేంద్రంగా పరిపాలన మొదలు పెడతామని చెప్పారు. వెలగపూడిలోని తాత్కాలిక సచివాలయంలో బుధవారం సీఎం వైఎస్ జగన్ అధ్యక్షతన మంత్రివర్గం సమావేశమైంది. ఎజెండాలోని అంశాలపై చర్చ ముగిశాక సమావేశం నుంచి అధికారులు నిష్క్రమించారు. ఆ తర్వాత మంత్రులతో సీఎం వైఎస్ జగన్ సమకాలీన రాజకీయ పరిస్థితులపై చర్చించారు. దసరా విశాఖపట్నంలోనే జరుపుకుందామని సీఎం వైఎస్ జగన్ చెప్పారు. ఆ రోజు నుంచి విశాఖపట్నం కేంద్రంగా పరిపాలన మొదలు పెడతామనడంతో మంత్రులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.



చర్చావేదికలో మాట్లాడుతున్న దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయం తొలి వీసీ సత్యనారాయణ

న్యాయ ప్రక్రియ అందరికీ సమానమే

- కొందరు దీన్ని పక్కదారి పట్టిస్తున్నారు
- 'స్కిల్'స్కామ్‌లో జీఎస్టీదే ఎక్కువ పాత్ర
- అవినీతిపై పక్కా ఆధారాలతోనే చంద్రబాబు అరెస్టు
- 'రూల్ ఆఫ్ లా అండ్ పబ్లిక్ సర్వీస్ లైఫ్'చర్చావేదికలో న్యాయ నిపుణులు

సాక్షి, విశాఖపట్నం: రాజ్యాంగం ప్రకారం న్యాయ ప్రక్రియ అందరికీ సమానమేనని, కానీ ఉన్నత స్థానాల్లో ఉన్న కొందరు దీన్ని పక్కదారి పట్టిస్తున్నారని న్యాయ నిపుణులు పేర్కొన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో పక్కా ఆధారాలతోనే మాజీ సీఎం చంద్రబాబు అరెస్టు జరిగిందని స్పష్టం చేశారు. న్యాయ వ్యవస్థపై గానీ, న్యాయమూర్తులపై గానీ విమర్శలు చేయడం తగదన్నారు. 'రూల్ ఆఫ్ లా అండ్ పబ్లిక్ సర్వీస్ లైఫ్'అనే అంశంపై వైజాగ్ ఇంటెలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో బుధవారం విశాఖలో చర్చా వేదిక నిర్వహించారు. దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయం (డీఎస్ఎన్ఎల్‌యూ) తొలి వైస్ చాన్స్‌లర్ వై.సత్యనారాయణ మాట్లాడుతూ అత్యాశ ఒక స్థాయి దాటిపోతే అవినీతికి దారితీస్తుందని, ఇది సమాజానికి పెను ప్రమాదమన్నారు. కొందరు ప్రముఖులు తమ పీఏలు, అనుచరుల ద్వారా అవినీతికి పాల్పడుతున్నారని డీఎస్ఎన్ఎల్‌యూ తొలి రిజిస్ట్రార్ ఎ.సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఒక ప్రముఖ ప్రజాప్రతినిధి అవినీతి కేసులో అరెస్టయితే నిరసనలు, ఆందోళనలు చేపడుతున్నారని, అదే సామాన్యుడి విషయంలో మాత్రం అలా జరగదన్నారు. ప్రధాని స్థాయి నుంచి సామాన్యుడి వరకు రూల్ ఆఫ్ లా ఒకేలా ఉండాలన్నారు. రూల్ ఆఫ్ లా కొంతమందికి అర్థం కావడం లేదని, అర్థమైన వారు కులాలు, పార్టీలుగా విడిపోతున్నారని చెప్పారు. అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్‌పై ఎన్నో కేసులున్నా అక్కడ ఆందోళనలు జరగడం లేదని గుర్తు చేశారు. ప్రస్తుత అధ్యక్షుడు బైడెన్ కుమారుడిపై కూడా అసత్య సమాచారం ఇచ్చారంటూ కేసు నమోదైందని చెప్పారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో సీఐడీ కంటే జీఎస్టీ పాత్రే ఎక్కువగా ఉందన్నారు. సీఐడీ అన్ని ఆధారాలతో చంద్రబాబును అరెస్టు చేసి రూల్ ఆఫ్ లాను పాటిస్తే ఒకవర్గం మీడియా, ఒక సామాజికవర్గం కక్ష సాధింపు అంటూ దుష్ప్రచారం చేస్తోందని సీనియర్ న్యాయవాది పాకా సత్యనారాయణ పేర్కొన్నారు. రూల్ ఆఫ్ లా విషయంలో పాలకులు, గత పాలకులు, ప్రజాప్రతినిధులు అతీతులు కారని వైజాగ్ ఇంటెలెక్చువల్ ఫోరం ప్రెసిడెంట్, యూపీఎస్సీ మాజీ సభ్యుడు ప్రొఫెసర్ కేఎస్ చలం స్పష్టం చేశారు. అవినీతి కేసుల్లో పలువురు మాజీ సీఎంలు అరెస్టయ్యారని, చంద్రబాబు అరెస్టు కొత్త కాదని లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ జి.సుబ్బారావు పేర్కొన్నారు.

జిల్లా వార్తలు

23న పెద్దమ్మగుడి దుకాణాలకు వేలం

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని శ్రీకనక దుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయ ప్రాంగణంలోని 11 వ్యాపార దుకాణాలకు మూడేళ్ల పాటు లైసెన్స్ హక్కుల కోసం ఈనెల 23న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈఓ ఎస్.రజినికుమారి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అలాగే భక్తులు అమ్మవారికి సమర్పించిన చీరలు కూడా వేలం వేస్తామని పేర్కొన్నారు. టెండర్‌లో పాల్గొనే వారు 23న ఉదయం 10 గంటలకు రూ.200 దేవస్థాన కార్యాలయంలో చెల్లించి షెడ్యూల్ పొందాలని సూచించారు. ఆ తర్వాత షెడ్యూల్‌లో చూపినట్టుగా ధరావత్ డీడీ జతపరిచి టెండర్ వేయాలని తెలిపారు.

పాల్వంచ, ఇల్లెందు జట్ల విజయం

ఖమ్మం స్పోర్ట్స్ : నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరుగుతున్న ఉమ్మడి జిల్లాస్థాయి అండర్ – 16 క్రికెట్ పోటీల్లో భాగంగా బుధవారం జరిగిన మ్యాచ్‌ల్లో పాల్వంచ, ఇల్లెందు జట్లు ఘన విజయం సాధించాయి. ముందుగా పాల్వంచ – సత్తుపల్లి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో బ్యాటింగ్ చేసిన పాల్వంచ జట్టు 137 పరుగులు చేసి 6 వికెట్లు కోల్పోగా తర్వాత బ్యాటింగ్ చేసిన సత్తుపల్లి జట్టు 94 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది. రెండో మ్యాచ్‌లో పాలేరు – ఇల్లెందు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఇల్లెందు జట్టు 3 వికెట్ల నష్టానికి 197 పరుగులు చేయగా, తర్వాత బ్యాటింగ్ చేసిన పాలేరు జట్టు 27 పరుగులకే బ్యాటింగ్ అర్డర్ కుప్పకూలింది. ఇల్లెందు బ్యాట్స్‌మెన్‌లలో ఉదయ్ 9 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 71 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

కేసీఆర్ సేవాదళ్ రాష్ట్ర గౌరవాధ్యక్షురాలిగా షకీనా



షకీనాకు నియామక పత్రం అందజేస్తున్న అమీర్

ఖమ్మంమయూరిసెంటర్: కేసీఆర్ సేవాదళ్ రాష్ట్ర గౌరవాధ్యక్షురాలిగా, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఖమ్మం నగరానికి చెందిన షేక్ షకీనా నియమితురాలయ్యారు. బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు నియమించారు. ఈ సందర్భంగా సేవాదళ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ అమీర్, రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు షకీనా ధన్యవాదాలు తెలిపారు.

ఎరియర్స్ సరే.. లాభాల వాటా?!

- యాజమాన్యం ప్రకటన కోసం సింగరేణి కార్మికుల ఎదురుచూపులు
- ఈ ఏడాది లాభాల్లో 35శాతం వాటా చెల్లించాలని కార్మిక సంఘాల డిమాండ్
- ఇప్పటికీ వెల్లడించకపోవడంతో అనుమానాలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ గడిచిన ఆర్థిక సంవత్సరం(2022–23)లో 65 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసింది. ఇంతలోనే 11వ వేజ్ బోర్డ్‌కు సంబంధించి వేతనాలు అమల్లోకి రాగా, 23 నెలల ఎరియర్స్ చెల్లింపుపై అధికారులు సర్క్యులర్ కూడా విడుదల చేశారు. కానీ గడిచిన ఆర్థిక సంవత్సరం కంపెనీ సాధించిన రూ.2,222 కోట్ల టర్నోవర్‌లో రూ.700 కోట్ల మేర లభాలు రాగా, కార్మికులకు వాటా చెల్లిస్తామని ప్రకటించినా ఎంత అనేది తేల్చడం లేదు. సంస్థలో 42వేల మంది పని చేస్తుండగా ఇప్పటికీ లాభాల వాటా ప్రకటించకపోవడం, చెల్లింపుపై స్పష్టత ఇవ్వకపోవడాన్ని కార్మిక సంఘాల నాయకులు తప్పుపడుతున్నారు.

1999 నుంచి లాభాల వాటా..

1999లో సింగరేణిలో సుమారు 1.16లక్షల మంది కార్మికులు పని చేస్తుండేవారు. అప్పట్లో సుమారు 64 గనుల్లో బొగ్గు ఉత్పత్తి జరిగేది. ఆ సమయాన సింగరేణి కార్మికుల బోనస్ పెంచాలని 56 రోజులు సమ్మె చేశారు. దీంతో అప్పటి ప్రభుత్వం బోనస్ పెంచడమే కాక లాభాల్లో 10శాతం వాటా ఇవ్వనున్నట్లు ప్రకటించింది. అలా 1999లో 10 శాతంతో మొదలైన లాభాల వాటా గతేడాది 30శాతం చెల్లించారు. ఈ నేపథ్యాన వాటాను 35 శాతానికి పెంచాలని కార్మికుల నుంచి వినతులు వెల్లువెత్తుతున్నాయి.



గనుల్లో పనిచేస్తున్న సింగరేణి కార్మికులు

గత కొన్నేళ్లలో వచ్చిన లాభాలు, చెల్లించిన వాటా..

ఏడాది	లాభాలు (రూ.కోట్లలో)	కార్మికులకు చెల్లించిన వాటా	కార్మికులకు చెల్లించిన నగదు (రూ.కోట్లలో)
2015-16	1,066.13	23శాతం	245.20
2016-17	395.38	25శాతం	98.84
2017-18	1,212.75	27శాతం	327.44
2018-19	1,766.65	28శాతం	494.66
2019-20	993.86	28శాతం	278.28
2020-21	272.64	29శాతం	79.06
2021-22	1,227.04	30 శాతం	368.11

గతేడాది కంటే ఎక్కువ ఇప్పిస్తాం...



1999 నుంచే లాభాల వాటా చెల్లిస్తున్నా 2014 నుంచే మెరుగైన పెరుగుదల ఉంది. పదిహేనేళ్ల కాలంలో 10శాతం పెరిగితే, ఎనిమిదిళ్లలో టీబీజీకేఎస్ పది శాతం పెంపునకు కారణమైంది. ఈ ఏడాది కూడా మెరుగైన లాభాల వాటా పెంచి ఇప్పించేందుకు ప్రయత్నిస్తాం.

– మిరియాల రాజిరెడ్డి, టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి

జూన్‌లోనే ఇచ్చే ఆనవాయితీ ఉండేది



ఆర్థిక సంవత్సరం ముగియగానే ఏ కంపెనీ అయినా టర్నోవర్, లాభాల వాటా వెల్లడిస్తుంది. సింగరేణిలో అలా జరగకపోగా, జూన్‌లోనే చెల్లించే ఆనవాయితీని విస్మరించారు. ప్రస్తుతం సింగరేణిలో ఎన్నికలు జరగనున్నందున లబ్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేస్తోంది.

– వాసిరెడ్డి సీతారామయ్య, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి

బకాయిలు కూడా లాభాల్లో కలపాలి



సింగరేణి ఈ ఏడాది సాధించిన లాభాలను ప్రకటించాలి. అలాగే, సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం నుండి రావాల్సిన రూ.24 వేల కోట్లను కూడా వసూలు చేసి లాభాల వాటాలో కలిపి కార్మికుల వాటా చెల్లించాలి. రూ.వందల కోట్ల ఆదాయం చూపిస్తున్నా కార్మికులకు పంచకుడం లేదు.

– పి.మాధవనాయక్, బీఎంఎస్ జాతీయ కార్యదర్శి

ఎక్కడా ఇవ్వని వాటా సింగరేణిలోనే..



కోలిండియా పరిధిలోని ఏ బొగ్గు పరిశ్రమల్లో కూడా కార్మికులకు వాటా చెల్లించడం లేదు. కానీ సింగరేణిలోనే యాజమాన్యం తు.చ. తప్పకుండా అమలు చేస్తోంది. ఇక లాభాల వాటా తెలంగాణ ఏర్పడ్డాక గణనీయంగా పెరిగింది. ఇది అందరూ హర్షించాల్సిన విషయం.

–ఎ.నాగేశ్వరరావు, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ సెక్రటరీ

కార్మికులకు చెల్లించడం కంపెనీ విధి



దేశంలో ఏ పరిశ్రమలో లేని లాభాల వాటా సింగరేణి కార్మికులకు దక్కుతోంది. కార్మికులు ప్రకృతికి విరుద్ధంగా గంటలకొద్దీ పనిచేసి కంపెనీని లాభాల్లో నడిపిస్తున్నారు. వారికి వాటా చెల్లించడం కొంత ఊరట కలిగిస్తుంది. కార్మికుల సంక్షేమాన్ని చూడాల్సిన బాధ్యత కంపెనీపై ఉంది.

– ఎస్.బలరామ్, సింగరేణి డైరెక్టర్ (పా)

'వందేభారత్'లో మరిన్ని సౌకర్యాలు

ఖమ్మం మామిళ్లగూడెం: సికింద్రాబాద్ నుంచి ఖమ్మం మీదుగా విశాఖపట్టణం వెళ్లే వందేభారత్ రైలును దక్షిణ మధ్య రైల్వే మరింత సౌకర్యవంతంగా తీర్చిదిద్దింది. సీట్ల వాలు కోణం 17.31నుంచి 19.37 డిగ్రీలకు పెంచింది. కుషన్ మెత్తదనాన్ని కూడా సవరించింది. ఎగ్జిక్యూటివ్ చైర్ కార్ రంగును ఎరుపు నుంచి ఆహ్లాదకరమైన నీలం రంగులోకి మార్చడంతోపాటు సీట్ల కిందిభాగంలో మొబైల్ చార్జింగ్ పాయింట్ ఏర్పాటు చేశారు. మరుగుదొడ్లలో వాష్‌బేసిన్ నీరు బయటకు చిమ్మకుండా లోతు పెంచారు. దివ్యాంగ ట్రైలర్ కోచ్‌లో వీల్ చైర్ల కోసం సెక్యూరింగ్ పాయింట్ ఏర్పాటు చేశారు. కోచ్ లోపల సౌందర్యాన్ని మెరుగుపరచడానికి ఎఫ్ఆర్‌సీ ప్యానెల్‌ను, మెరుగైన ఎయిర్ కండిషన్‌కు ప్యానళ్లపై ఇన్సులేషన్ అమర్చారు.



వందేభారత్ రైలు

అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్



విజయ్‌కుమార్

పాల్వంచరూరల్/ నేలకొండపల్లి : పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న పి. విజయ్‌కుమార్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారని ప్రిన్సిపాల్ చిన్నప్పయ్య తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్. ఆర్.కె. పవన్‌కుమార్ పర్యవేక్షణలో 'ఇన్ఫర్మేషన్ లిట్రసీ ప్రోగ్రామ్స్ ఇన్ లైబ్రరీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్ తెలంగాణ ఏ స్టడీ' అనే సిద్ధాంత గ్రంథానికి గాను విజయ్‌కుమార్ డాక్టరేట్ పొందారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీ లైబ్రరీలలో గల సదుపాయాలను ఆన్‌లైన్ లో రిసోర్సెస్ లైబ్రరీ సర్వీసెస్ ను కాలేజీ గ్రంథాలయ అధికారులు ఏ విధంగా విద్యార్థులకు అందిస్తున్నారు, ఎలాంటి ఆన్‌లైన్, ఇంటర్‌నెట్ సేవలను వినియోగిస్తున్నారు అనే అంశాల పై విజయ్‌కుమార్ పరిశోధనా గ్రంథాన్ని సమర్పించారు. విజయ్‌కుమార్ 2011లో మణుగూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పబ్లిక్ కమిషన్ ద్వారా ఉద్యోగంలో చేరారు. 2016లో పదోన్నతి ద్వారా పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన పరిశోధనకు సహకరించిన ఉస్మానియా యూనివర్సిటీ అధ్యాపకులు డాక్టర్ ఎస్.యాదగిరి, డాక్టర్ ఏ.ఎస్. చక్రవర్తి, డాక్టర్ అంజయ్యతో పాటు డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, విజయ్‌కుమార్‌ను నేలకొండపల్లి సర్పంచ్ రాయపూడి నవీన్, ఎంపీటీసీ బొడ్డు బొందయ్య తదితరులు అభినందించారు.

పరిస్థితులకు అనుగుణంగా ఎత్తుగడలు



ప్రజాపంథాలో చేరిన వారితో పోటు రంగారావు, గుమ్మడి నర్సయ్య తదితరులు

- ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు
- ఎన్డీ నుంచి పలువురు ప్రజాపంథాలో చేరిక

ఖమ్మంమయూరిసెంటర్ : దేశంలో పెట్టుబడిదారీ వ్యవస్థ అధికృతలోకి వచ్చిందని, భూస్వామ్య వ్యతిరేక పోరాటాలతో దానిని విముక్తి చేయలేమని, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పార్టీ ఎత్తుగడలను మార్చుకోవాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు పిలుపునిచ్చారు. బుధవారం సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీకి చెందిన జిల్లా, డివిజన్, మండల స్థాయి నాయకులు, ప్రజా సంఘాల నేతలు ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథాలో చేరారు. కొల్లేటి నాగేశ్వరరావు, తిమ్మిడి హనుమంతరావు, శోభారాణి, గూగులోత్ తేజ నాయక్, కొత్తపల్లి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ప్రజాపంథాలోకి చేరిన వారికి పోటు రంగారావు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, పార్టీ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ.. మారిన పరిస్థితులకు అనుగుణంగా కార్మికవర్గ పోరాటాలు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. ఫాసిస్ట్ కార్పొరేట్ శక్తులు ఐక్యమై ప్రజలను దోపిడీ చేస్తున్న నేపథ్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేయాలని అన్నారు. మారిన పరిస్థితులకు తగినట్లుగా నూతన కర్తవ్యాన్ని రూపొందించుకొని పోరాటాలకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు.

పార్టీలో చేరికలతో ప్రజా ఉద్యమాలకు మరింత బలం చేకూరుతుందని అన్నారు. కార్యక్రమంలో ప్రజాపంథా రాష్ట్ర నాయకులు చంద్ర అరుణ, గుర్రం అచ్చయ్య, ఆవుల వెంకటేశ్వర్లు, జి.రామయ్య, ఆవుల అశోక్, పీఓడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి శిరోమణి, పీడీఎస్‌యూ కార్యదర్శి ఆజాద్, ఎన్నబోయిన శ్రీనివాస్, రావుల నాగేశ్వరరావు, నరెడ్డి శ్రీనివాసరెడ్డి, కొత్తపల్లి వీరారెడ్డి, ధరావత్ సక్రు, పులకాని సత్తిరెడ్డి, అంగిరేకుల లింగయ్య, బోర ఎలమంచి, పేర్ల బిక్షం, అంజలి, శిరీష, మౌనిక, భవాని తదితరులు పాల్గొన్నారు.